APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

20-07-2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి: 17 | సంచిక: 266
పేజీలు: 04 | వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.
expresstelugudaily.com



2

## క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు నేడు శ్రీకారం



# పార్లమెంట్ సమావేశాలకు సర్వం సిద్ధం

**నేటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు**

**8 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ**

- నీట్, అయోధ్య అంశాలపై పోరుకు విపక్షాలు సై
- ఆగస్టు 13 వరకు కొనసాగనున్న వర్షా కాల సమావేశాలు
- సభలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరిన కేంద్రం
- అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో అఖిలపక్ష సమావేశం నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్ నాథ్

**నేషనల్ బ్యూరో, తెలంగాణ బ్యూరో:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం 8 బిల్లులను సిద్ధం చేసింది. ముఖ్యంగా సోమవారమే పార్లమెంట్ ముందుకు రెండు కీలక బిల్లులు రానున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37 కు పెంచుతూ రూపొందించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. వందేమాతరం గేయానికి జాతీయగీతం హోదా కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీకేజీ సహా పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి. ఈ మేరకు కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష భేటీలో తమ వైఖరిని స్పష్టం చేశాయి. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి. అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో రక్షణ మంత్రి రాజ్ నాథ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నాయకులు హాజరయ్యారు. ఈ భేటీలో అయోధ్య మిగతా2లో...

# ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు

- కొందరు నేతలు హైదరాబాద్‌లో కూర్చొని పనిచేయట్లేదు
- ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దు
- పదవుల కోసం వచ్చే వారికి గాంధీభవన్‌లో అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు
- ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి
- ఇన్‌ఛార్జిలుగా ఉన్న చోట ఎంపీలు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తాం
- బీఎల్‌వోల రిపోర్టులపై మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయి
- పార్టీ పరంగా పనిచేస్తున్న బీఎల్‌ఏలను నేతలు సమర్థంగా ఉపయోగించాలి
- పార్టీ ముఖ్య నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పదవుల కోసం గాంధీ భవన్‌కు వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. సర్‌పై నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రేపటి నుంచి ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దన్నారు. కొందరు నేతలు హైదరాబాద్‌లో కూర్చొని పనిచేయట్లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 3 వరకు పొడిగించారని, ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో సర్‌పై సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. "119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సర్‌పై 489 భేటీలు జరిగాయి. వెనుకబడిన నియోజకవర్గాల్లో నేతలు ఇప్పటికైనా స్పందించాలి. ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దు. పదవుల కోసం వచ్చే వారికి గాంధీభవన్‌లో అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి. ఇన్‌ఛార్జిలుగా ఉన్న చోట ఎంపీలు పనిచేయకపోతే..

మిగతా2లో...



# కళను ప్రోత్సహించడం సమాజ బాధ్యత

- ఆర్‌కే లక్ష్మణ్ వంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయం
- తెలుగులో శ్రీధర్, శంకర్ వంటి కార్టూనిస్టుల ప్రతిభ గొప్పది
- మహాత్మా గాంధీ విలువలు, ఆయన చూపిన సిద్ధాంతాల అవసరం దేశానికి మరింత పెరిగింది
- అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు మేలు చేయడమే ప్రజాప్రతినిధుల కర్తవ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

# టీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఉచిత వైద్యం, విద్య ఇచ్చి చూపిస్తా

- ఈ మాట చెప్పిన వెంటనే నాపై విమర్శలు చేస్తున్నారు
- ప్రస్తుత బడ్జెట్ తో సాధ్యం కాదు.. డబ్బులు ఎక్కడ నుండి ఇస్తావంటున్నారు
- నాయకులు అవినీతి సొమ్ము తినడం మానేస్తే పేదవాళ్లకు ఉచిత విద్య, వైద్యం అందుతాయి
- తెలంగాణ రక్షణసేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత



2

# యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం

- బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదు
- రెండున్నరేళ్లలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2



విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

Contacts
తెలంగాణ
95500 21491

# వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా మా లక్ష్యం

**ఇల్లెందు, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఇల్లెందు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కామేపల్లి మండలం మద్దులపల్లి, ఇల్లెందు మండలం రొంపేడు, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కామేపల్లి మండలంలో పెద్ద చెరువు అభివృద్ధి పనులు, పలు బీటీ రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కొత్త విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

**రాష్ట్రంలో 16 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం..**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోందని, గత కొద్ది కాలంలోనే సుమారు 5 వేల మెగావాట్ల డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం రాష్ట్రానికి 16 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. అయినప్పటికీ వ్యవసాయ, గృహ, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు.

**విద్యుత్ సమస్యల పరిష్కారానికి 160 అత్యవసర వాహనాలు..**

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేందుకు 160 ప్రత్యేక అత్యవసర వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. డివిజన్ వారీగా వీటిని ఏర్పాటు చేశామని, విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు 1912 టోల్‌ఫ్రీ నంబర్కు సమాచారం ఇస్తే అవసరమైన పరికరాలతో సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని వివరించారు.

**పోడు సాగుదారులకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం'..**

ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజన పోడు సాగుదారుల కోసం ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులతో *'ఇందిరా సౌర గిరి జల వికాసం'* పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద బోర్‌వెల్లు, పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను అందజేస్తామని, దీనివల్ల గిరిజన రైతుల ఆత్మగౌరవం, ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

**సింగరేణి భవిష్యత్తుకు ప్రత్యేక ప్రణాళికలు..**

సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం కొత్త బ్లాకుల సాధనలో చొరవ చూపకపోవడంతో సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని విమర్శించారు. తాడిచెర్ల బ్లాక్‌ను సింగరేణికి దక్కేలా కేంద్రంతో చర్చలు జరిపి ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఇల్లెందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్‌మిత్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ & ఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ తాటిపాముల సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఉచిత వైద్యం, విద్య ఇచ్చి చూపిస్తా

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రక్షణసేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత కోరుట్లలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్‌కు అధికారం ఇస్తే ఎంతపెద్ద రోగం వచ్చినా, ఎంత బిల్ అయినా కుటుంబంలో ఎంతమందికైనా ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందిస్తుందని అన్నారు. తాను ఈ మాట చెప్పిన వెంటనే అన్ని పార్టీలలోని అన్నలు, తండ్రులు తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న బడ్జెట్ తో అది సాధ్యం కాదని, డబ్బులు ఎక్కడ నుండి ఇస్తావని అంటున్నారని చెప్పారు. నాయకుల అవినీతి సొమ్ము తీసుకుని మానేస్తే పేదవాళ్లకు ఉచిత విద్య, వైద్యం అందుతాయని అన్నారు. ఇప్పుడున్న బడ్జెట్ తోనే ఉచిత వైద్యం, విద్య అందించవచ్చని లెక్కలతో సహా చెబుతానని వ్యాఖ్యానించారు. తన తల్లి పట్టుబట్టి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివించిందని, ఆమె దయతో అమెరికా వరకు వెళ్లి చదువుకున్నానని తెలిపారు. టీఆర్ఎస్ ను గెలిపిస్తే అదే తెలివితో విద్య, వైద్యం అందించి చూపిస్తానని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ అవసరమైన పనులు చేసిపెడితే మరో పార్టీ పెట్టాల్సిన అవసరం ఎందుకు వస్తుందన్నారు. అవినీతి అన్యాయం జరుగుతున్నాయని చెప్పినందుకే బీఆర్ఎస్ తనను బయటకు గెంటేసిందన్నారు. ప్రజా ఉద్యమాలు చేసినందుకే తనను బయటకు పంపించారని తెలిపారు.

## క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు నేడు శ్రీకారం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో పేదవారి సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని.. ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చివరి లబ్ధిదారుని వరకు గౌరవప్రదమైన సొంతింటిని నిర్మించి అందిస్తామని చెప్పారు. పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే ప్రజాప్రభుత్వ సంకల్పమని తెలిపారు. సొంత నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేద ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గత నెల ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం ఇప్పుడు హైదరాబాద్ నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా నిజం చేయబోతున్నదని మంత్రి చెప్పారు. క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు సెక్రెటేరియట్‌లో హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్‌తో కలిసి దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం

**కరీంనగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్::** ప్రతి జిల్లాలో ఎల్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, తాగునీరు, వైద్యం, విద్యుత్, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. సమీక్ష అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. "సాగునీటి విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లేవు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) చెప్తే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తాం. ఒక్కరోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదు. యువతను కేటీఆర్ పక్కదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదు. పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరైనా అడ్డుకున్నారా?రెండున్నరేళ్లలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం"అని శ్రీధర్‌బాబు అన్నారు.

## మరోసారి 3 నెలల రేషన్ సరుకులు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మరోసారి 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆహార సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖ కీలక ఉత్తర్వును జారీ చేసింది. ఇప్పుడు రేషన్ కార్డు లబ్ధిదారులు మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పొందనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సరిపడా రేషన్‌ను ఏకకాలంలో కేటాయించాలని సంబంధిత శాఖ నిర్ణయించింది. వర్షాకాలంలో తలెత్తే రవాణా, నిల్వ సవాళ్లను పరిష్కరించి, తద్వారా దేశంలోని పేద కుటుంబాలు రేషన్ల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా చేయడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశ్యం. ఆగస్ట్ 1వ తేదీ నుంచి మూడు నెలలు అంటే ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సరుకులు ఒకేసారి ఇవ్వనున్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఈ రేషన్‌ను లబ్ధిదారులకు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. కార్డుదారులు గానీ, ఫెయిర్ ప్రైస్ షాపు యజమానులు గానీ ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది వరకు సాధారణంగా ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 రోజుల పాటు మాత్రమే డీలర్లు రేషన్ బియ్యం ఇచ్చేవారు. వచ్చే నెలలో 3 నెలల రేషన్ ఒకేసారి ఇవ్వనుండటంతో ఆగస్టులో 31 రోజులు దుకాణాలు తెరచి బియ్యం అందించాల్సి ఉంది. ప్రతి రేషన్ కార్డుదారు మూడుసార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది.

## యూనివర్సిటీలు ఎందుకు పెట్టారు..



**హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రైవేట్ యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు.. వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశించింది. ప్రైవేట్ యూనివర్సిటీలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్స్)లను నియమించింది. అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవకాశం కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ యూనివర్సిటీని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశించిన 9 అంశాలపై ఈ కమిటీ తనిఖీలు చేపడుతోంది.

**9 అంశాలపై తనిఖీ...**

ప్రైవేట్ యూనివర్సిటీలకు సంబంధించి 9 అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు వివరణ కోరిన అంశాలు..

1. అసలు యూనివర్సిటీ ఎందుకు ఏర్పాటు చేశారు. దాని ఏర్పాటుకు కారణాలు, ఉద్దేశాలు ఏమిటి? యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారా? స్థాపనకు ముందు ఏమైనా విధానపరమైన పరిశీలన (పాలసీ కన్సిడరేషన్) చేశారా? లేదా?
2. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా భూ కేటాయింపు చేసిందా? యూనివర్సిటీకి కల్పించిన ఇతర ప్రయోజనాలు.. అందుకు విధించిన నిబంధనలు, షరతులు ఏమిటి?
3. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న సొసైటీ, సంస్థ, వ్యక్తి ధ్యేయం ఏమిటి?. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న సభ్యులు ఎవరు? ఆ సభ్యులను ఎలా ఎంపిక చేశారు. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న వ్యక్తి, మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యుల సమగ్ర వివరాలు.
4. విద్యార్థులు యూనివర్సిటీలో చేరడానికి ఏ విధానం అవలంభిస్తున్నారు. ఎంట్రన్స్‌కు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలు, ఆ నిబంధనలు చట్టానికి అనుగుణంగా ఉన్నాయా? లేదా?.. ఎంట్రన్స్‌కు సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించిందా? ధ్రువీకరించిందా?
5. బోధనా సిబ్బందిని (అకడమిక్ స్టాఫ్) యూనివర్సిటీ ఎలా నియమించింది. వారి ఎంపికను ఏ కమిటీ చేపట్టింది. సిబ్బంది నియామకం యూజీసీ నిబంధనలకు లోబడే చేపట్టారా? ఆ నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించిందా..?
6. రాష్ట్రంలో ఇతర విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు విధించిన నిబంధనలు, షరతులను ఈ యూనివర్సిటీలు కచ్చితంగా పాటిస్తున్నాయని నిర్ధరించడానికి ప్రభుత్వం తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసిందా? చేస్తే ఆ బృందం తనిఖీలు (ఇన్‌స్పెక్షన్లు) నిర్వహిస్తుందా? తరచూ తనిఖీలు చేస్తున్నాందా? నిబంధనల అమలును తనిఖీ బృందం పర్యవేక్షిస్తుందా? ఏవైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? నిబంధనలు ఉల్లంఘిస్తే ఏమైనా చర్యలు తీసుకున్నారా? ప్రభుత్వం తరఫు నుంచి ఏవైనా మినహాయింపులు ఇచ్చారా?
7. 'లాభాపేక్ష లేని, నష్టం లేని' (నో ప్రాఫిట్, నో లాస్) ప్రాతిపదికన పని చేస్తున్నామని ప్రకటించుకున్న యూనివర్సిటీలు నిజంగా అలానే పని చేస్తున్నాయా? ప్రభుత్వం దానిని ఏ అధికారంతో అనుమతించింది. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులకు చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చులు, సంపాదించిన ఆస్తులతో సహా ఇతర అంశాలకు యూనివర్సిటీల నిధులు మళ్లించలేదని ఎలా నిర్ధారించారు? ఆయా యూనివర్సిటీల ఖాతాలను ఖాతాలను ఆడిట్ చేశారా? నిధుల మళ్లింపుపై ఏవైనా పరిశీలన చేశారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులకు చేసిన చెల్లింపులను నిశితంగా పరిశీలించారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తులను పరిశీలించారా? ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? గుర్తిస్తే తీసుకున్న చర్యలు ఏమిటి?
8. విద్యార్థులతో పాటు బోధనా సిబ్బంది ఫిర్యాదుల పరిష్కారానికి ఏదైనా వ్యవస్థ సదరు యూనివర్సిటీలో ఉందా? ఉంటే అవి పని చేస్తున్నాయా? ఫిర్యాదుల పరిష్కార కమిటీల కూర్పు ఎలా ఉంది. అప్పీలేట్ చేసుకునే అవకాశం ఉందా? ఇప్పటి వకు ఏవైనా ఫిర్యాదులు అందాయా? అందితే వాటిని పరిష్కరించారా.?
9. యూనివర్సిటీలు చట్టప్రకారం నిర్దేశించిన కనీస వేతనాలను అకడమిక్ స్టాఫ్‌కు చెల్లిస్తున్నాయా? యూజీసీ నిబంధనల అమలును ధ్రువీకరించారా? సిబ్బంది వేతనాల రికార్డులను పరిశీలించారా? ఈ క్రమంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన గుర్తించారా? అలా గుర్తిస్తే ఏమైనా చర్య తీసుకున్నారా?

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనిఖీ బృందం రాష్ట్రంలోని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఆయా అంశాలను తనిఖీ చేసి ఆ వివరాలతో సమగ్ర అఫిడవిట్ రూపొందిస్తోంది. ఆ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. అఫిడవిట్ సమర్పణ అనంతరం సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అలాగే తనిఖీ బృందం ఈ 9 అంశాలతో పాటు సంబంధిత ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనుంది.

## పార్లమెంట్ సమావేశాలకు
# సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీక్, పెట్రోల్‌లో ఈ20 ఇంధన మిశ్రమం వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపుర్‌లో పరిస్థితులపైనా చర్చించాలని కోరినట్లు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న నిరసనపై కూడా చర్చ జరగాలని సమాజ్‌వాదీ పార్టీ డిమాండ్ చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల బలంతోనే అమలు చేయాలని డీఎంకే కోరింది. అటు పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని అఖిలపక్ష భేటీలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి.. కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఉభయ సభల్లో విపక్షాల అభిప్రాయాలను వింటామని స్పష్టం చేశారు. విపక్షాలు కూడా తమ వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల చర్చల తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఎనిమిది బిల్లుల జాబితా మాత్రమే ఉందని తెలిపారు. అదనంగా మరే బిల్లును ప్రవేశపెట్టాల్సి వచ్చినా ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో చర్చించి, ప్రతిపక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. జీరో అవర్, ప్రత్యేక ప్రస్తావనలు వంటి అంశాలు సాధారణ పార్లమెంటరీ ప్రక్రియలో భాగమేనని, ప్రతి సభ్యుడికి వాటిపై మాట్లాడే హక్కు ఉంటుందని చెప్పారు. అయితే ఈ అఖిలపక్ష భేటీ వాడీవేడిగా సాగింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్‌ఆద్మీ, వామపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. 20 మంది తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం పంపడంపై టీఎంసీ నిరసన తెలిపింది. తిరుగుబాటు ఎంపీల విలీనానికి స్పీకర్ ఆమోదం తెలపలేదని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పేర్కొన్నారు. టేబుల్ ఆఫీస్ జాబితాలో టీఎంసీ బలం 28గా ఉందన్నారు. 91వ సవరణ తర్వాత ప్రత్యేక కూటమికి ఆస్కారం లేదని వివరించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ తెలిపారు. తుది నిర్ణయం తీసుకోకుండా టీఎంసీ సంఖ్యాబలం అంచనా వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాసేపటికి విపక్ష ఎంపీలు మళ్లీ సమావేశానికి తిరిగొచ్చారు.

## ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కఠినంగా వ్యవహరిస్తాం. పార్టీ పరంగా సర్ ఇన్‌ఛార్జిలుగా ఉన్న వారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. బీఎల్‌వోల నివేదికల కంటే బీఎల్ఏల రిపోర్టులను పరిశీలించాలి. బీఎల్‌వోల రిపోర్టులపై మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయి. పార్టీ పరంగా పనిచేస్తున్న బీఎల్ఏలను నేతలు సమర్థంగా ఉపయోగించాలి. పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి.. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు. వచ్చే 10 రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి. సర్‌కు నియమించిన పార్టీ ఇన్‌ఛార్జిలు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. ఈనెల 30న మళ్లీ పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తాం. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని సమన్వయం చేయాలి. బాగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీతో ఫొటో దిగే అవకాశం ఉంటుంది" అని సీఎం తెలిపారు.

## తక్కువ వడ్డీతో నిధుల సమీకరణ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి.. స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కుందన్‌బాగ్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంస్థల ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రుణభారం తగ్గించి, తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు సమీకరించేలా 10 రోజుల్లో సమగ్ర ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. బడ్జెట్ పై ఆధారపడకుండా సాగునీటి సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించేందుకు కొత్త ఆర్థిక నమూనాలను రూపొందించాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సాగునీటి సంస్థల ఖాళీ భూముల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం లేదా లీజుకు ఇచ్చి ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. నిజాంసాగర్‌తోపాటు ఇతర జలాశయాల పరిసరాల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల సాధ్యతను అధ్యయనం చేయాలని సూచించారు. కొత్త ఆదాయ మార్గాల వల్ల రైతులపై ఎలాంటి అదనపు భారం పడకూడదని స్పష్టం చేశారు. 202223తోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక సంవత్సరాల చట్టబద్ధ ఆడిట్లను వెంటనే పూర్తి చేయాలని.. ఆడిటర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 11 శాతం వడ్డీతో ఉన్న రుణాలను తక్కువ వడ్డీకి మార్చితే ఏటా సుమారు రూ.250 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉన్నదని అధికారులు వివరించారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన రుణ వివరాలు, వడ్డీ, చెల్లింపులు, పనుల పురోగతి, పూర్తి చేయడానికి అవసరమైన నిధులు తదితర అంశాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే.. శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల పూర్తి వివరాలను 15 రోజుల్లో సిద్ధం చేసి వనరుల సమీకరణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ పరిహారానికి ఇప్పటికే విడుదల చేసిన నిధులు ఆలస్యం లేకుండా రైతులకు చేరేలా చూడాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఈఎన్సీ (జనరల్) రమేశ్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కళను ప్రోత్సహించడం సమాజ బాధ్యత

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం అని.. సమాజం, రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కళలను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్2026 ప్రదానోత్సవంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ జీవితంలో ప్రతిరోజూ విమర్శలు, ప్రతి విమర్శల మధ్య గడుపుతున్న తమకు ఇలాంటి ఆహ్లాదకరమైన సాహిత్య, కళా వేదికల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో మమేకమయ్యే అవకాశాలు అరుదుగా వస్తాయని, అలాంటి సందర్భాలు పాత జ్ఞాపకాలను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తాయని చెప్పారు. దేశంలో ఆర్‌కే లక్ష్మణ్ వంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయమని, అంతర్జాతీయంగా బిల్ వాటర్సన్ సృష్టించిన క్యాల్విన్ అండ్ హాబ్స్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. తెలుగులో శ్రీధర్, శంకర్ వంటి కార్టూనిస్టుల ప్రతిభ గొప్పదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్మా గాంధీ విలువలు, ఆయన చూపిన సిద్ధాంతాల అవసరం దేశానికి మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. జీవితంలో గెలుపు, ఓటములు సహజమని.. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు మేలు చేయడమే ప్రజాప్రతినిధుల కర్తవ్యమని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలపాటు కార్టూనిస్టుగా శేఖర్ విశిష్ట సేవలు అందించారని అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన గీసిన కార్టూన్లు ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించాయని కొనియాడారు. వచ్చే ఏడాది నుంచి శేఖర్ మెమోరియల్ అవార్డులను మరింత ఘనంగా నిర్వహించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రవీంద్రభారతిలో మరింత వైభవంగా కార్యక్రమం నిర్వహించేలా అండగా ఉంటానని తెలిపారు. కాగా.. కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం.నారు, ఆర్టిస్టు విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్ అవార్డులు అందుకున్నారు.

## సేవా రత్న జాతీయస్థాయి పురస్కారం అందుకున్న డాక్టర్ బొడ్డోజు మల్లయాచారి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో "సేవా రత్న జాతీయస్థాయి పురస్కారం-2026" ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం లో ఘనంగా నిర్వహించారు. ఆర్కె పురం డివిజన్ అలకాపురి కి చెందిన ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త డాక్టర్ బొడ్డోజు మల్లయాచారి ని విద్య, సాహిత్యం, సామాజిక సేవా రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ "సేవా రత్న జాతీయ స్థాయి పురస్కారంతో ఘనంగా సత్కరించారు.గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి విద్యా, సాహిత్య, సామాజిక రంగాల్లో విశేష కృషి చేసి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడమే అకాడమీ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ టీవీ కొరియోగ్రాఫర్ లయన్ సూర్యతేజ సుబ్రాంత్ , తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట్‌లో కుబేరా సిల్క్స్ 5వ బ్రాంచ్
# ఘనంగా ప్రారంభించిన నటి నిహారిక కొణిదెల

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్ :** తెలంగాణలో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన కుబేరా సిల్క్స్ తన 5వ బ్రాంచ్‌ను కొత్తపేట్ మెయిన్ రోడ్ లో ప్రముఖ నటి నిహారిక కొణిదెల ప్రారంభించారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ కుబేర సిల్క్స్ లో కలెక్షన్స్ తనకి ఎంతో ఇష్టమని నా దగ్గర అన్ని వెరైటీలు అన్ని కలర్స్ ఎప్పుడు రెడీగా ఉంచుకుంటాను ప్రతి అకేషన్ కి చీరలనే కట్టుకోవడానికి మక్కువ చూపిస్తానని, వారు మరిన్ని బ్రాంచీలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కుబేరా సిల్క్స్ వ్యవస్థాపకులు ఎం. శ్యాంసుందర్, జి. శ్రీనివాస్, డా. జి. షాలిని మాట్లాడుతూ, నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలతో వినియోగదారులకు ఉత్తమమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో విస్తరణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, ఫ్యాన్సీ వేర్, సంప్రదాయ దుస్తులు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**ప్రత్యేక ప్రారంభ ఆఫర్లు**

- పట్టు చీరలు రూ.999 నుంచే
- ఎంపిక చేసిన చీరలపై ఒకటి కొనుగోలు చేస్తే మరో చీర రూ.1కే
- రూ.5,000లకు 12 చీరలు ప్రారంభోత్సవ సందర్భంగా ఈరోజు ఇస్తున్నాము.
- డజన్ పట్టు చీరల ప్రత్యేక ప్యాక్ రూ.5,000కే
- ఆషాఢం మెగా సేల్ సందర్భంగా అన్ని బ్రాంచ్‌లలో గరిష్టంగా 50 శాతం వరకు తగ్గింపులు ఉంటాయని తెలిపారు.








# కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇది




- కేసీఆర్‌పై పగతోనే కాళేశ్వరం నీటిని ఆపేశారు
- రేవంత్ రెడ్డి కళ్లు తెరవకపోతే రైతులే బుద్ధి చెబుతారు
- కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావు గేట్లు ఎత్తితేనే వస్తాయి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరిక

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్ :** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయని పక్షంలో యావత్ తెలంగాణ రైతుల కోపాగ్నిలో ప్రభుత్వం మాడి మసైపోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. అన్నపూర్ణ సాగర్ నుంచి రంగనాయక సాగర్ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగతో, ప్రతీకారంతో కాళేశ్వరం గేట్లు ఎత్తడం లేదని, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ఆరు సంవత్సరాలుగా తెలంగాణలో కరువు అంటే ఏంటో తెలియకుండా పాలన సాగిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కరువును సృష్టించిందని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో మా ప్రభుత్వ హయాంలో ఎండాకాలంలో కూడా చెరువులు అలుగులు పారడం మనం చూశామని, రెండు పంటలు పండించుకుని రైతులు సంతోషంగా జీవించారని ఆయన గుర్తు చేశారు. కానీ నేడు రైతుల అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా, కేవలం రాజకీయ కక్షలతో ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గేట్లు ఎత్తితేనే పంటలకు నీరు అందుతాయి**

కేసీఆర్‌ను తిట్టడం వల్ల రైతుల పొలాల్లోకి నీళ్లు రావని, కాలువ గేట్లు ఎత్తితేనే నీళ్లు అందుతాయని హరీశ్‌రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి రైతులు తిరగబడతారని హెచ్చరించారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును చూస్తుంటే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువుగా కనిపిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఈ పాదయాత్ర బీఆర్ఎస్ పార్టీ పెట్టింది కాదని, ఇది అచ్చంగా చిన్నకోడూరు మండల రైతుల పాదయాత్ర అని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ మొండి వైఖరిని ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




# ఎల్‌నినోతో కరువు కోరల్లో తెలంగాణ

- తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం ఆదుకోవాలి
- సింగరేణి సంస్థకు బొగ్గు గనులను కేటాయించాలి
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలి
- ఓబీసీ, మహిళా రిజర్వేషన్లపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి
- అఖిల పక్ష సమావేశంలో రాష్ట్ర సమస్యలను లేవనెత్తిన ఎంపీ వద్దిరాజు

**న్యూ ఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజల తరపున పలు కీలక డిమాండ్లను బలంగా వినిపించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్లు ఎండిపోవడంతో విద్యుదుత్పత్తి తగ్గి, కరెంట్ కోతలు పెరుగుతున్నాయని, దీనిని అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీ స్పష్టం చేశారు. కేసీఆర్ కృషితో అప్పగించిన తాడిచర్ల2 గనిని గుర్తు చేస్తూ, అదే తరహాలో కోయగూడెం3, సత్తుపల్లి3, శ్రావణపల్లి సహా మరికొన్ని గనులను వెంటనే సింగరేణి సంస్థకు బదలాయించాలని కోరారు. తద్వారా సింగరేణికి లాభాలు చేకూరడమే కాకుండా, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, థర్మల్ పవర్ ఉత్పత్తి కూడా మెరుగుపడుతుందని వివరించారు.

**ప్రాజెక్టులకు జాతీయ హోదా - పెండింగ్ ప్రాజెక్టులు**

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేంద్రం చూపుతున్న వివక్షను ఎంపీ తప్పుబట్టారు. పాలమూరురంగారెడ్డి లేదా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అంబేద్కర్‌వార్ధా, సీతమ్మ, సమ్మక్కసారలమ్మ సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే అనుమతులివ్వాలని కోరారు. గతంలో కేసీఆర్ రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో యూరియా సరఫరా ద్వారా మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలను కూడా ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు: ఆదిలాబాద్ సీసీఐ కర్మాగారం పునరుద్ధరణ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ కర్మాగారం ఏర్పాటును వేగవంతం చేయాలి. ఆదిలాబాద్, మామునూరు, కొత్తగూడెం విమానాశ్రయాల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, హైదరాబాద్ మెట్రో రైల్ 2వ దశకు అనుమతులు ఇవ్వాలి. ఓబీసీలు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని మరియు రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటూ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై ఎంపీ విమర్శలు గుప్పించారు. తన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.

# జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు

- అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రలకు తాత్కాలిక బ్రేక్
- భక్తుల భద్రత దృష్ట్యా బేస్ క్యాంపుల వద్దే నిలిపివేత
- సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే యాత్ర పునఃప్రారంభం

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో పవిత్ర అమర్‌నాథ్ యాత్ర మరియు మాతా వైష్ణోదేవి యాత్రలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కొండ ప్రాంతాల్లో వాతావరణం వేగంగా మారుతున్న దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) జారీ చేసిన ప్రతికూల వాతావరణ నివేదికల ఆధారంగా కాశ్మీర్ డివిజనల్ కమిషనర్ అన్షుల్ గార్గ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కాశ్మీర్ లోయలో కురుస్తున్న



వర్షాల కారణంగా పహల్గామ్ మరియు బల్తాల్ రెండు మార్గాల ద్వారా సాగే శ్రీ అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. బల్తాల్, నున్వాన్ మరియు చందన్‌వారీ బేస్ క్యాంపుల నుండి భక్తులను ముందుకు అనుమతించడం లేదు. అలాగే జమ్మూలోని భగవతీ నగర్ యాత్రి నివాస్ నుండి కూడా యాత్రికుల కాన్వాయ్‌లను కాశ్మీర్ వైపు వెళ్లేందుకు అనుమతించడం లేదని అధికారులు వెల్లడించారు.

**పరిస్థితిని సమీక్షిస్తున్న యంత్రాంగం**

ప్రస్తుతానికి వాతావరణ పరిస్థితులు మరియు మార్గాల భద్రతను క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షిస్తున్నామని, అంతా సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే యాత్రను పునఃప్రారంభిస్తామని అధికారులు స్పష్టం చేశారు. అప్పటి వరకు భక్తులు సహకరించాలని కోరారు. కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు మూడు లక్షల డెబ్బై ఆరు వేల మందికి పైగా భక్తులు పవిత్ర మంచు లింగాన్ని దర్శించుకున్నారు. యాత్ర పునఃప్రారంభంపై తదుపరి అప్‌డేట్స్ కోసం భక్తులు అధికారిక ప్రకటనలను గమనించాలని సూచించారు.




Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com